# గృహస్థ జీవితము - శ్రీ రామచంద్ర రాజయోగ సాధన

భగవంతుని సంకల్పమువలన సృష్టి ఆవిర్భవించినది. భగవంతుడు సృష్టిలోని జీవరాశులన్నిటిలో మానవుని విశిష్టజీవిగా తీర్చిదిద్దాడు. ఎందువలనంటే భగవంతుడు అమితమైన శక్తిని ఉపయోగించు ఉపకరణమైన మనస్సును మానవునకు ప్రసాదించాడు. సృష్టికి మూలమైన ఆది చైతన్యశక్తి ప్రతి మానవునిలోను భాగమై మనస్సుగా పిలువబడుచున్నది.

సృష్టిలో మానవుడు ఆవిర్భవించినప్పటినుండి ప్రకృతిలోని ప్రతిదానిని పరిశీలించి ప్రతిదానిని తనకనుగుణంగా మలచుకొని ప్రయోజనము పొందుటకు ప్రయత్నిస్తున్నాడు. మరొకప్రక్క ప్రతిదాని అంతర్గత రహస్యము వెలువరించుటకును, సత్యమును గ్రహించుటకును దైవారాధన చేయుటయే మానవజాతియొక్క అన్వేషణయై కొనసాగుచున్నది. ఈ క్రమములో గొప్ప మతకర్తల స్వానుభవములపై ఆధారపడి నియమబద్ధములైన సాంప్రదాయములు, కర్మకాండలతో గూడి ప్రపంచములో అనేక మతములు ఉద్భవించినవి.

ప్రపంచములో విజ్ఞానశాస్త్రము అన్నిరంగములలో అభివృద్ధి చెందుటవలన ప్రజలు ఆధునిక జీవనమునకు అలవాటుపడి ధనము, ఆస్తులు, భౌతిక సౌఖ్యములనే జీవితములో ప్రధానాంశములుగా పరిగణిస్తున్నారు. మరొక ప్రక్క ఆధునిక ప్రపంచములో ప్రజలు తమ జీవిత విధానము పూర్తిగా మారి నాగరికత, నవీన విజ్ఞానము అభివృద్ధిచెంది యున్నను భిన్న మతముల పేరుతో అసూయావైరములు, గ్రుడ్డి నమ్మకములు, సమాజములో వృత్తివిభజన నిమిత్తము ఏర్పరచబడిన పనివారల సంఘములు కులములుగా రూపాంతరము చెంది ఈర్ష్యాద్వేషములతో ఘర్షణపడుతూ సమాజమునుండి వేరుపడి ప్రత్యేకమైన గుర్తింపుకొరకు ప్రయత్నించుచూ సమాజాన్ని విచ్ఛిన్నస్థితికి దారితీయునట్లు చేయుచున్నారు. దీనికంతటికీ కారణము మానవునిలోని అహంకారము, మమకారము, స్వార్థము, దురభిప్రాయము, ఈర్ష్య, ద్వేషము, సంకుచిత బుద్ధి మొదలగు దుర్గుణములు.

ప్రపంచములో అందరికీ అందుబాటులోకి వస్తున్న అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానమును మానవాభ్యుదయానికి ఉపయోగించాలి. కాని మరొకప్రక్క అదే సాంకేతిక పరిజ్ఞానము మానవ వినాశనానికి దారితీసే విధ్వంసక పరికరాల నిర్మాణమునకు, సమాజములో వివిధ నేరములకు కారణభూతమవుతోందన్నది జగద్విదితము. ప్రపంచములో ఆధునిక విజ్ఞానం సాంకేతికంగా ఎంత ముందంజ వేస్తున్నా, నాగరికత ఎంత అభివృద్ధి చెందుచున్నను, ఆధునిక మానవుడు

నిరంతరము అశాంతితో గడుపవలసిన పరిస్థితి ఏర్పడింది. ఈ దుస్థితి మానవజీవితములోని వివిధ రంగములన్నింటికీ వ్యాపించి మానవ మనుగడకే ప్రశ్నార్థకమై ప్రపంచ మానవాళిని అశాంతికి గురిచేస్తున్నది. ఆధునిక నాగరికతా ప్రభావంతో ప్రజలలో అసురీ ప్రవృత్తి పెంపొంది తప్పుడు పనులకు వారు కారణభూతులవుతున్నారు. వీటన్నిటినుండి బయటపడాలంటే మనము భౌతికతావాదముతో కూడిన జీవిత విధానమునుండి ఆధ్యాత్మికతతో కూడిన జీవనమువైపు మరలాలి.

మనమందరము గృహస్థులము. ప్రజలకు ఆధ్యాత్మికత యొక్క విలువ తెలియదు. ఏలన ఆధ్యాత్మికతను గురించి సమాజంగాని, తల్లిదండ్రులుగాని వారికి బోధించుట లేదు. అంటే చాలామంది ప్రజలు ఆధ్యాత్మిక జీవనమంటే గృహస్థ జీవితమును విడనాడి సమాజానికి దూరంగా పారిపోయి అడవులలో తపస్సు చేయటం మాత్రమేనని అపోహ పడుచున్నారు. అందువలన ఆధ్యాత్మికత గృహస్థులకు పనికిరాదని, కొద్దిమంది సన్యాసులు, కుటుంబానికి దూరమగువారు మాత్రమే తపస్సు చేయగలరని ప్రజలు భావిస్తున్నారు. కాని ఇది సరికాదు. భగవంతుడు మనలను సృష్టించినది ప్రపంచమునుండి పారిపోయి ఏకాంత జీవనము గడుపమని కాదని అర్థము చేసుకోవాలి. గృహస్థులమైన మనము మన ప్రాపంచిక బాధ్యతలను పూర్తిగా విస్మరించి గృహమునుండి పారిపోయి ఎటువంటి నిర్దిష్ట లక్ష్యము, ఎవరికీ ప్రయోజనము లేకుండా దూరంగా గడుపుట ఎంతమాత్రము సమర్థనీయం కాదు. ఇటువంటి పరిస్థితులు కల్గించడం అంటే మానవజీవితాన్ని వ్యర్థం చేయడమే.

భగవంతుడు మనకు ప్రసాదించిన మానవజీవితము ఒక గొప్ప వరము. భగవంతుడు ప్రసాదించిన మానవజీవిత కాలవ్యవధి పరిమితమైనది. భగవంతుడు ప్రసాదించిన మనస్సును ఉపయోగించి మానవుడు పరిణతి చెందగలడు. మానవుడు తన మనస్సును దైవమువైపు మరలించి భగవంతుడు తనకొసగిన శక్తి సామర్థ్యములను ఉపయోగించి తనలోని దివ్యత్వాన్ని బహిర్గతము చేసి, తన జీవిత లక్ష్య మైన సత్‌తత్వప్రాప్తిస్థితిని సాధించి, ప్రకృతికి అనుగుణంగా సమస్త సమాజ శ్రేయస్సుకొరకు పాటుపడి, దివ్య మానవ ప్రపంచ ఆవిర్భావమునకు తోడ్పడి భగవంతుని సృష్టికి పరిపూర్ణత చేకూర్చుటయే మానవజీవిత పరమార్థము.

సాధారణముగా గృహస్థ జీవితము గడుపుచున్న ప్రజలు వారి జీవితములలో విలువైన సమయాన్నంతా ధనార్జనకు, పేరు ప్రఖ్యాతులు గడించుటకు, ప్రాపంచిక జీవిత సౌఖ్యములను అనుభవించుటకు ప్రాధాన్యతనిస్తూ గడిపేస్తుంటారు. ప్రజల మనస్సులు నిలకడలేని ఆలోచనలతో అస్తవ్యస్తముగా వుంటాయి. మనస్సు పెక్కు భావములను, ఉద్రేకములను,

ఉద్వేగములను, కోర్కెలను, చంచల ప్రవృత్తులను కలిగిస్తుంది.

మనము మొదట ఈ ప్రపంచములో పుట్టినప్పుడు ఏ మూలమునుండి మనము వచ్చినామో ఆ మూలము శుద్ధమైనది కాబట్టి, మనము కూడా శుద్ధమై వుండినాము. కనుక మన మనస్సు తన ప్రప్రథమ స్థితిలో వున్నప్పుడు పూర్తిగా శుద్ధంగా వుండేది. కాలం గడిచేకొలది మనమే మనస్సును అతిగా కార్యకలాపాలలో పాల్గొనేటట్లు చేసి, అస్థిరమైన దానినిగాను, చంచలమైనదిగాను తయారుచేసి దాని అలవాట్లను పాడుచేసి నాము. అది తన పూర్వపు స్థితిని తిరిగి పొందడానికి దానిని సరిదిద్దవలసివుంది. కనుక మనస్సును నిలకడలేని ఆలోచనల నుండి దారి మళ్ళించి భగవంతునితో అనుసంధానము గావించే మార్గము కావాలి. అదియే రాజయోగము. భగవంతుడు సూక్ష్మము గనుక సూక్ష్మ మార్గముతోనే భగవంతుని తెలియగలము. రాజయోగము సూక్ష్మ మైనది, తేలికయైనది, శక్తివంతమైనది రాజయోగములన్నిటిలోను శ్రీరామచంద్ర రాజయోగము విశిష్టమైనది. శ్రీ రామచంద్ర రాజయోగము, ప్రాణాహుతి అను దివ్యశక్తినుపయోగించి సాధకుల హృదయాలలోని పూర్వ సంస్కారాలను, అవరోధాలను, మాలిన్యాలను తొలగించవచ్చును.

ప్రజలు ఇంతకాలము అనుసరిస్తున్న కర్మకాండలు, మత విభేదాలు, జాతి విభేదాలు, కుల విభేదాలు, మూఢాచారములు, సంప్రదాయముల పేరున విధులు, విధానములు, ప్రజల మధ్య వైషమ్యాలు పెంపొందించి ప్రజలను విడతీసాయి. వేల సంవత్సరములు గడిచినా, ఎన్ని మతములుద్భవించినా, ఎన్ని సంస్థలు కృషిచేసినా, ఎంతమంది సంఘసంస్కర్తలు వివిధ రీతులలో ప్రయత్నము చేసినా మానవులలో మార్పు రాలేదన్నది మనందరకు తెలిసిన వాస్తవ విషయము. ఇటువంటి పరిస్థితులలో, గురుదేవులు పూజ్య శ్రీ రామచంద్రజీ మహారాజ్ (పూజ్య బాబూజీ మహారాజ్) ప్రజలు ఇంతకాలము ఆచరిస్తున్న ఛాందస భావాలతో కూడిన ఆచార వ్యవహారములను, సాధనా విధానములను సమూలముగా ప్రక్షాళనగావించి, దివ్య జీవనమునకు మూల సూత్రములైన ఐకమత్యము, పరస్పర సహకారము, పరహితము, త్యాగము, సేవాతత్పరత మొదలగునవి ఆచరించుటకు వీలగు ప్రాణాహుతితో కూడిన రాజయోగ సాధనను ప్రసాదించి నూతన నాగరికతకు నాంది పలికారు. ఉన్నత స్థితులను పొందుటకు ఆధ్యాత్మిక శిక్షణ కేవలము ప్రాణాహుతి విధానము ద్వారా మాత్రమే సాధ్యమనియు, వేరొక విధానము కాదనియు గురుదేవులు పూజ్య బాబూజీ మహారాజ్ నొక్కి వక్కాణించారు. గురుదేవులు ప్రస్తుత కాలావసరాలకు అనువుగాను, గృహస్థ జీవితము గడుపుచున్న సామాన్య మానవుని సాధారణ జీవిత విధానానికి అనుగుణంగాను తగు మార్పులు చేసి తేలికగా ఆచరించుటకు వీలుగా ప్రాణాహుతితో కూడిన రాజయోగ సాధనను ప్రపంచ మానవాళికి ప్రసాదించారు. ఈ సాధనా

విధానము గృహస్థునికి సంసార జీవితాన్ని గడుపుతూ, అన్ని బాధ్యతలు నిర్వహిస్తూ కూడ అత్యున్నత ఆధ్యాత్మికస్థితిని పొందుటకు వీలుకల్పించింది.

ఈ పద్ధతిలో ప్రాణాహుతి అనునది అత్యంత విశిష్టమైన అంశము. ప్రాణాహుతి అను దివ్యశక్తినుపయోగించి సాధకుల హృదయములలోని సంస్కారాలను, అవరోధాలను, మాలిన్యాలను తొలగించి ఆధ్యాత్మికోన్నత స్థితులను కలుగజేయవచ్చును. ఈ సాధనా విధానములో సాధకుని అభ్యాసముతోపాటు, సాధనా మార్గములో అడ్డంకులను, మాలిన్యాలను తొలగిస్తూ, అతని మనస్సును క్రమశిక్షణలో పెట్టబడి ప్రాణాహుతి ప్రసారము ద్వారా సాధకుని ఆధ్యాత్మిక పురోగమనాన్ని వేగిరపరచే గురుదేవుల చేయూత నిరంతరము కొనసాగుతుంది. అంటే గురుదేవుల దివ్యకృప తోడ్పడుట అత్యావశ్యకము. ఈ సాధనలో ప్రధానమైన ఈ రెండంశాలను, మన నిజజీవిత లక్ష్యమును సదా దృష్టిలో పెట్టుకొని మన సంస్థ శ్రీ రామచంద్ర చైతన్య ప్రవంతి (ISRC)చే నిర్దేశించబడిన సాధనా నియమములను, పద్ధతులను పాటించుచు నియమిత సమయములో క్రమ పద్ధతిలో క్రమశిక్షణతో సాధకుడు సాధనను ఆచరించాలి.

శ్రీ రామచంద్ర రాజయోగ సాధనా విధానము గాక మరే సాధనా విధానము గాని, పూజా విధానము గాని ఆధ్యాత్మిక రంగములో అతిస్వల్ప కాలమైన మానవ జీవిత భాగములో సులభంగా ఉన్నతస్థాయి ఫలితాలను యివ్వజాలదని ప్రజలు స్వానుభవముచే గ్రహించగలరు. ఈ సాధనా విధానములో ప్రాణాహుతి ద్వారా ఎన్నో జన్మలనుండియే గాక ఆధునిక నాగరికతా ప్రభావముతో ఏర్పడిన సంస్కారాలను, మాలిన్యాలను, అవరోధాలను సమూలముగా తొలగించుట వలన ఆధ్యాత్మిక యాత్ర సాధ్య మై దివ్యలక్షణాలను పెంపొందించుకొని నిజజీవిత లక్ష్య మైన సత్‌తత్వప్రాప్తిస్థితిని ఒక జీవితకాలమందే సులభంగా పొందవచ్చును.

ఈ విధముగా గృహస్థ జీవితమును గడుపుచున్న మనమంతా పరిణామము చెంది పూజ్య గురుదేవుల చైతన్యములో వుంటూ మన గృహస్థ ధర్మములు, బాధ్యతలు నెరవేరుస్తూ సమాజమునకు హితము చేకూర్చే కార్యములు కొనసాగిస్తూ, సర్వమానవాళికి ఆధ్యాత్మిక సేవ కొనసాగిస్తాము. గురుదేవులు పూజ్య బాబూజీ మహారాజ్ ప్రసాదించిన రాజయోగ సాధన ఫలితంగా వ్యక్తులలో మార్పు, వారి ద్వారా సమాజములో మార్పు, అటు తర్వాత ప్రపంచములో మార్పు సంభవించి దివ్య మానవ ప్రపంచము ఆవిర్భవిస్తుంది. కనుక శ్రీ రామచంద్ర రాజయోగ సాధనను ఆచరించుట సమస్త మానవాళికి శుభము.

* * *